క్లుప్తంగా

లక్ష్మీ నరసింహ స్వామి కల్యాణం నేడు



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీ నరసింహ స్వామి

అద్దంకి: శింగరకొండపైనున్న శ్రీ లక్ష్మీ నరసింహ స్వామికి శనివారం ప్రత్యేక ప ఊజలు అభిషేకాలు నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. స్వామివారి జయంతి సందర్భంగా ఆదివారం కళ్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ కార్య నిర్వహణాధికారి శనివారం తెలిపారు. కళ్యాణం తరువాత భక్తులకు అన్న ప్రసాద పంపిణీ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

శింగరకొండ దర్శిని



ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్టు

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం వైశాఖ మాసం స్వాతి నక్షత్రం చతుర్దశి తిథి సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.



వేటపాలెంలో నిరుపయోగంగా ఉన్న చేపల మార్కెట్ షెడ్డు



రావూరిపేట వద్ద కాలువ కరకట్టపై చేపల విక్రయాలు

లక్ష్యానికి గ్రహణం.. జనాలకు దుర్గంధం

- రూ.7.50 లక్షల గ్రామ పంచాయతీ నిధులు వృథా
- మందుబాబులకు అడ్డాగా మారిన చేపల మార్కెట్ షెడ్డు
- ప్రస్తుతం కాలవ కరకట్టపై చేపలు, మాంసం విక్రయాలు
- పట్టించుకోని పంచాయతీ, మండల స్థాయి అధికారులు



రావూరిపేట కాలవ కట్ట వద్ద ప్రధాన రోడ్డుకు ఇరువైపులా కొనుగోలు దారుల వాహనాలు

వేటపాలెం: అధికారుల నిర్లక్ష్యంతో మత్స్యకారులు చేపలు, మాంసం విక్రయాలను కాలవ కరకట్టపై జరుపుకోవాల్సి దుస్థితి ఏర్పడింది. ప్రభుత్వం లక్షలు ఖర్చు చేసి నిర్మించిన చేపల మార్కెట్ భవనం నిరుపయోగంగా ఉండి పోయింది. 2017–18లో గ్రామ పంచాయతీ నిధులు రూ.7.50 లక్షలతో చేపలు, మాంసం విక్రయించు కొనేందుకు అనువుగా ప్లాట్ ఫాం, మంచినీటి సౌకర్యంతో షెడ్డు నిర్మించారు. అయితే ఆ తరువాత కేవలం ఒక్క సంవత్సరం మాత్రమే దీన్ని ఎస్సీ, ఎస్టీ మత్స్యకారులు వినియోగించు కొన్నారు. తరువాత కరోనా సమయంలో లాక్ డౌన్ కారణంగా మార్కెట్ మూసివేశారు. కరోనా సమయంలో గ్రామ శివారు లోని రావూరిపేట శివారులోని స్ట్రయిట్ కట్ కాలవ కరకట్టపై ఊరికి దూరంగా విక్రయాల కోసం ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు చేపలు, మాంసం విక్రయాలు కాలవ కరకట్టపైనే జరుగుతున్నాయి. కొనుగోలు దారుల వాహనాలు ప్రధాన రోడ్డుకు ఇరువైపులా నిలుపుద చేయడంతో తరచూ ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతోంది. దీంతో ప్రధాన రోడ్లుపై పాదచారులు నడిచి వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు పక్కనే జంత కళేబరాలు వేళ్లాడదీసి విక్రయించడం తో పాటు వాటి వ్యర్థాలు అక్కడనే పడేస్తున్నారు. లక్షలు పెట్టి నిర్మించిన చేపల మార్కెట్ షెడ్డు నిరుపయోగంగా ఉండటంతో రాత్రి వేళల్లో మందు బాబులకు, ఆకతాయిలకు అడ్డాగా మారింది. రాత్రి వేళలో ఈ షెడ్డులో చీకటి కార్యక్రమాలు నిర్వహించడంతో ఇటు వైపుగా మహిళలు వెళ్లడానికి భయపడుతున్నారు. ఇప్పటికైనా గ్రామ పంచాయతీ, మండల స్థాయి అధికారులు రోడ్డుపై చేపల విక్రయాలు నిలుపుదల చేయించి మార్కెట్‌లోనే వ్యాపారాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మురుగు నీటి కాలవ కరకట్టపై మార్కెట్ షెడ్డుల నిర్మాణం..

రామన్నపే పంచాయతీ పరిధిలోని రావూరిపేట స్ట్రయిట్ కట్ మురుగు నీటి కాలవ కరకట్ట పై 15వ ఆర్థిక సంఘం నిధులతో కార్యదర్శ రూ.4 లక్షలు నిధులతో తాత్కాలిక షెడ్డులు వేసి.. మాంసం చేపలు విక్రయాల కోసం షెడ్డులు రెండు నెలల క్రితం వేయించారు. ఆర్థిక సంఘం నిధులు తాత్కాలిక షెడ్డుల నిర్మాణం కోసం మళ్లించిన ఓ అధికారి పర్సంటేజీలతో జేబులు నింపుకున్నాడనే ప్రచారం జోరుగా జరుగుతోంది.

వైభవంగా ప్రతిష్ఠా మహోత్సవాలు



ప్రతిష్ఠా వేడుకల్లో పాల్గొన్న భక్తులు

బల్లికురవ: ఎంతో చరిత్రకలిగిన కొణిదెన గ్రామంలోని బ్రహ్మకుండం వద్ద ఓంకార ధ్యాన పరమేశ్వరుడు నీల కంఠేశ్వరస్వామి విగ్రహప్రతిష్ఠా మహోత్సవాలు శనివారం ఉదయం 8.30 గంటలకు వైభవంగా నిర్వహించారు. రాజుపాలెం గ్రామ ప్రతిష్ఠాచార్యులు ఐనవోలు సీతారామాచార్యులు, ఆలయ అర్చకుడు కొనిదెన శ్రీరామ మూర్తి,అద్దంకి నాగబ్రహ్మచారి చే గణపతి పూజ, పుణ్యాహవాచనం, అఖండ దీప స్థాపన, దీక్షా ధారణ, ప్రధాన కలశస్థాపన, ఓంకార ధ్యాన పరమేశ్వరుడికి నీల కంఠేశ్వరుడికి పంచామృతాలతో అభిషేకం చేపట్టారు. గంగపాలెం గ్రామానికి చెందిన చెరుకూరి చెంచు రామయ్య, సుధారాణి దంపతులు ఖర్చు భరించటంతోపాటు వేడుకల్లో పాల్గొన్నారు.

6 సంవత్సరాలుగా అభివృద్ధి పథంలో..

చరిత్ర కలిగిన బ్రహ్మకుండాన్ని అభివృద్ధి పరచాలని కొణిదెన తోపాటు ఆ పంచాయతీలోని గంగపాలెం వాసులు భావించారు. ఇక్కడ వల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యేశ్వర స్వామిని, జంట నాగులు, గణపతి, శివుడు, పార్వతి అమ్మవారు. మేధ దక్షిణామూర్తి, నవగ్రహాలు, అభయాంజనేయ స్వామి విగ్రహాల ఏర్పాటుతో గణపతి నవరాత్రులు, దసరా శరన్నారాత్రులు, కార్తీకమాసంలో పూజలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇక్కడ బ్రహ్మకుండంలో సంవత్సరం పొడవున నీరు అందటంతో అక్కడే స్నానాలు చేసి పూజల్లో పాల్గోనే ఏర్పాట్లును గ్రామ కమిటీ వారు చేపట్టారు.

అత్తింటి వారి వేధింపులపై యువతి ధర్నా



ధర్నాకు దిగిన రేష్మ ఆమె కుటుంబ సభ్యులు

మార్టూరు: తన కన్న తండ్రి సమానుడైన భర్త తండ్రి లైంగిక వేధింపులతో పాటు అత్తింటివారు ఇంట్లోకి రానివ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్న విషయమై ఓ యువతి అత్తింటి వారికి చెందిన షాపు ముందు ధర్నాకు దిగిన సంఘటన మండలంలోని వలపర్ల గ్రామంలో శనివారం రాత్రి జరిగింది. బాధిత యువతి వివరాలు ఇలా ఉన్నాయి. వలపర్లకు చెందిన షేక్ రేష్మ 21 అదే గ్రామానికి చెందిన సాఫ్ట్ వేర్ ఇంజినీర్ అయిన షేక్ అజీమ్ బాషాతో గత సంవత్సరం ఫిబ్రవరి నెలలో వివాహం జరిగింది. వివాహ సమయంలో రేష్మ తన పుట్టింటి వారి నుంచి 22 లక్షల రూపాయల నగదు 25 సవర్ల బంగారు ఆభరణాలను వరకట్నంగా తీసుకువెళ్ళింది. ఉద్యోగరీత్యా రేష్మ భర్త అజీమ్ బాష బెంగళూరు లోనే ఉంటూ రేష్మను వలపర్లలోనే ఉంచి అప్పుడప్పుడు వచ్చి వెళుతున్నాడు. ఈ క్రమంలో గత ఆగస్టు నుంచి అజీమ్ బాష తండ్రి జాకీర్ హుస్సేన్.. కోడలితో అసభ్యంగా ప్రవర్తిస్తూ లైంగిక వేధింపులకు గురి చేయసాగాడు. విషయాన్ని మొదట భర్తతో తెలిపింది. అనంతరం మార్టూరు సీఐ శేషగిరి దగ్గర ఫిర్యాదు చేసిన రేష్మ బంధువులు.. న్యాయం జరగకపోవడంతో చివరగా ఎమ్మెల్యే ఏలూరి క్యాంప్ కార్యాలయంలో తమ బాధను వెళ్ళబోసుకున్నారు. అయినా రేష్మకు ఎలాంటి న్యాయం జరగకపోవడంతో తమ కుటుంబ సభ్యులతో కలిసి శనివారం రాత్రి అత్తగారింటికి వెళ్ళింది. రేష్మ అత్త తాజుంబి, తోడికోడలు కమ్యున్నీ సా, బావ రఫీ, మామ జాకీర్ హుస్సేన్ లు రేష్మను ఆమె కుటుంబ సభ్యులను ఇంట్లోకి రానివ్వకుండా బయటికి గెంటివేసి తలుపులు వేసుకొని ఎటో వెళ్లిపోయారు. అంతటితో చేసేదేమీ లేక రేష్మ తన కుటుంబ సభ్యులతో కలిసి తన మామ తాజుద్దీన్‌కు వలపర్ల సెంటర్లో ఉన్న స్టీల్ షాపు ముందు టెంట్ వేసుకొని న్యాయం చేయాలంటూ పోరాటానికి దిగింది. రేష్మ కుటుంబానికి స్థానికులు పెద్ద ఎత్తున మద్దతుగా నిలిచారు. తన మామ పై తగు చర్యలు తీసుకొని తనను తన భర్త వద్దకు పంపి న్యాయం చేయాలని రేష్మ ఆమె కుటుంబ సభ్యులు ఈమేరకు కోరుతున్నారు.

ఘనంగా మదర్స్‌డే



వేటపాలెం: తల్లులకు పాదాభివందనం చేస్తున్న చిన్నారులు

యద్దనపూడి: ఈ సృష్టిలో అమ్మ ప్రేమకు వెలకట్టలేమని.. కరుణ, ప్రేమ, ధైర్యం దయ వంటి అంశాలు ఆమెలో ఇమిడి ఉంటాయని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సుజాత అన్నారు. మాతృదినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం మండలంలోని గన్నవరం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లికి వందనం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. మెరుగైన సమాజ నిర్మాణంలో మాతృమూర్తులదే ప్రధాన భూమికని, సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న మహిళలు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ చిన్నారులకు తమ తల్లుల ద్వారా ఆశీర్వాదాలు ఇప్పించారు. కార్యకర్తలు హేమలత, ఝాన్సీ, సునీత, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వేటపాలెం: ప్రతి చంటి బిడ్డకు తొలి గురువు తల్లి మాత్రమే అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సజ్జా పుష్పవల్లి పేర్కొన్నారు. రామన్నపేట అంగన్‌వాడీ కేంద్రంలో మదర్స్ డే సందర్భంగా మాతృదేవోభవ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. సూపర్‌వైజర్ మాట్లాడుతూ తల్లి రుణం ఎప్పటికీ తీర్చుకోలేనిదన్నారు. తల్లి నేర్పిన విద్యాబుద్ధుల ద్వారా పిల్లలు పెరిగి ఉత్తమ పౌరులుగా ఎదుగుతారని తెలిపారు. అనంతరం చిన్నారులు వారి తల్లులకు పాదాభివందనం చేశారు. కార్యకర్తలు నాగూర్‌బి, అలివేలు, చిన్నారులు, తల్లులు పాల్గొన్నారు.



తల్లుల వద్ద ఆశీర్వాదం తీసుకుంటున్న చిన్నారులు

రాతి ముఖ మండప నిర్మాణానికి విరాళాలు



ఏసీకి విరాళం అందిస్తున్న దాతలు



విరాళం అందుకుంటున్న దృశ్యం

అద్దంకి: శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి రాతి ముఖ మండప నిర్మాణం కోసం దాతలు విరివిగా విరాళాలు ఇస్తున్నారు. దానిలో భాగంగా శనివారం పట్టణంలోని కాకానిపాలెంలోని నరిశెట్టి నారాయణరావు, దేవి దంపతులు స్వామివారి ముఖ మంట నిర్మాణానికి 1,01,116లు విరాళంగా ఏసీ తిమ్మనాయుడికి అందజేశారు. అలాగే శనివారం పట్టణంలోని కాకానిపాలెంలోని మానికొండ నాగేశ్వర రావు, ఆదిలక్ష్మి దంపతులు స్వామివారి ముఖ మంట నిర్మాణానికి 1.30 లక్షలు విరాళంగా ఏసీ తిమ్మనాయుడికి అందజేశారు.

అద్దంకి రూరల్: శింగరకొండ గ్రామానికి చెందిన కొండి ఆంజనేయులు, హరిప్రియ దంపతులు రూ. 101,116ను దేవస్థాన ఏసీ తిమ్మనాయుడుకు శనివారం అందజేశారు. వారికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

మాజీ మహిళా మంత్రిపై దౌర్జన్యమా?

అద్దంకి: మాజీ మంత్రి మహిళ అయిన విడదల రజినీని అక్కడి సీఐ బెదిరిండం, ఆమెపై దౌర్జన్యానికి దిగడం ఏమిటని వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జి పానెం చిన హనిమిరెడ్డి శనివారం ప్రకటనలో ప్రశ్నించారు. మహిళ అని చూడకుండా, మాజీ మంత్రి అని కూడా లెక్క చేయకుండా చిలకలూరిపేటలో శనివారం అక్కడి సీఐ బెదిరింపులకు దిగడం, దౌర్జన్యానికి పాల్పడటం ఏమిటన్నారు. ఈ కూటమి ప్రభుత్వంలో మాజీ మంత్రులంటేనే లెక్క లేకపోతే, ఇక సామాన్యుల పరిస్థితి ఏమిటని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఆ సీఐపై చట్టపరపమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రతి ఒక్కరూ తల్లులను గౌరవించాలి



రేణింగవరం అంగన్‌వాడీ సెంటర్‌లో మదర్స్ డే నిర్వహిస్తున్న దృశ్యం

జె.పంగులూరు: ప్రతి ఒక్కరూ తల్లులను గౌరవించినప్పుడే సమాజం గౌరవంగా ఉంటుందని.. సమాజానికి విలువ వస్తుందని ఐసీడీఎస్ అంగన్‌వాడీ ముప్పవరం సెక్టార్ సూపర్ వైజర్ పద్మజ అన్నారు. మండలంలోని రేణింగవరం గ్రామంలో దళిత కాలనీలో ఉన్న అంగన్‌వాడీ సెంటర్‌లో శనివారం తల్లికి వందనం కార్యక్రమంలో భాగంగా మదర్స్‌డే నిర్వహించారు. పద్మజ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తల్లికి తన బిడ్డకు మొదటి గురువని.. నడక, నడత నేర్పిస్తుందన్నారు. తల్లుల పట్ల ఆదర్శవంతంగా ప్రేమ దయతో మెలగాలని తెలిపారు. ఎక్కడైతే తల్లి గౌరవిస్తారో అక్కడ ఆనందం ఉంటుందని పద్మజ తెలిపారు. ఈ సందర్భంగా తల్లికి వందనం చేస్తూ, కాలనీలోని కొంతమంది తల్లులను పూలమాలతో సత్కరించి గౌరవించారు. కార్యక్రమంలో పి. సైనీ, సుబ్బరావమ్మ పాల్గొన్నారు.

సబ్సిడీపై పశుదాణా సిద్ధం

బల్లికురవ: బల్లికురవ, పెదఅంబడిపూడి, పశువైద్యశాలలో 50 శాతం సబ్సిడీపై పశుదాణ పొందేందుకు అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోవాలని పశువైద్యాధికారులు పి. మహేశ్వరరావు, ఆర్. పావని కుమారి శనివారం తెలిపారు. ఒక్కో పాడి రైతు కుటుంబానికి 50 కేజీల బస్తా, సబ్సిడీ పోను రూ. 555 అందజేయనున్నట్లు చెప్పారు. తెల్ల రేషన్‌కార్డు, ఆధార్ కార్డు జెరాక్స్‌లతో పాటు ఫోన్‌నంబర్‌తో పశు వైద్యశాలలో సంప్రదించాలన్నారు.

ప్రసన్నాంజనేయునికి ఆకుపూజ



శింగరకొండలో ఆకుపూజ చేస్తున్న భక్తులు

అద్దంకి రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామికి భక్తులు శనివారం ఆకుపూజ నిర్వహించారు. క్షేత్రప్రాధాన్యత గల శనివారం కావడంతో భక్తులు పొంగళ్లు పెట్టి స్వామివారికి నివేదించి మొక్కులు తీర్చుకున్నారు. వేకువజామునుంచి స్వామివారి సుప్రభాతం, బిందెతీర్థం, పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు ఆలయ అర్చకులు ఉచిత ప్రసాదాలు పంపిణీ చేశారు.

నేడు సమైక్యతా ర్యాలీ

చీరాల అర్బన్: వీర జవాన్లకు సంఘీభావంగా ఎస్ఆర్‌పీఎం హైస్కూల్ వాకర్స్ అసోసియేషన్, రోటరీ క్లబ్ ఆఫ్ చీరాల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో సమైక్యతా ర్యాలీ నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ ప్రతినిధులు శనివారం తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి హైస్కూల్ గ్రౌండ్ నుంచి ర్యాలీ బయలుదేరుతుందన్నారు. కార్యక్రమంలో అందరూ పాల్గొని జవాన్లకు సంఘీభావం పలకాలన్నారు.

ఔషధ, సుగంధ మొక్కలతో లాభాలు



సుగంధ, ఔషధ మొక్కల నర్సరీని పరిశీలిస్తున్న చంద్రశేఖర్

వేటపాలెం: ప్రతి ఇంటి ముందు పెరటిలో ఔషధ, సుగంధ మొక్కలు పెంచు కోవడం వల్ల ఎంతో ప్రయోజనం చేకూరుతుందని రాష్ట్ర ఔషధ, సుగంధ మొక్కల బోర్డు చీఫ్ ఎగ్జికూటివ్ అధికారి ఎ. చంద్రశేఖర్ పేర్కొన్నారు. మండల పరిధిలోని అక్కాయిపాలెం పంచాయతీ లక్ష్మీపురంలో ప్రొటెక్ట్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఔషధ, సుగంధ మొక్కల నర్సరీని ఆయన శనివారం సందర్శించారు. ప్రతి పొదుపు మహిళ ఐదు మొక్కలు పెంచు కోవడం ద్వారా వారి కుటుంబానికి అవి ఎంతో ఉపయోగపడతాయన్నారు. వర్షాకాలం నాటికి ఔషధ మొక్కలు పంపిణీకి సిద్ధం చేయాలని నర్సరీ నిర్వాహకుడికి సూచించారు. ప్రొటెక్ట్ సంస్థ కార్యదర్శి శనం చంద్రరెడ్డి, నాగూరా పాల్గొన్నారు.